క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడు బుజ్జికి పరామర్శ



బుజ్జిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పాల సంఘ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి బుజ్జిని ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పరామర్శించారు. ఇటీవల విశాఖలోని కిమ్స్ ఐకాన్‌లో గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేసుకుని ఇంటికి వచ్చిన బుజ్జి ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని బొడ్డేడ ఆకాంక్షించారు. మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, పార్టీ నాయకులు భీముని వెంకటేశ్వరరావు, పిన్నమరాజు రవీంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న గోవిందరావు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణంలో భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా పాటిపల్లికి చెందిన ఆడారి జోగినాయుడు, మంగయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గోవిందరావు, జయంతి దంపతులు ఆదివారం రూ.25,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ములబంద గోడీ రైతు సంఘ అధ్యక్షునిగా నూకరాజు

మునగపాక: మునగపాకలో ములబంద గోడీ రైతు సంఘ అధ్యక్షునిగా దొడ్డి నూకరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వినాయక ఆలయంలో ఆదివారం సంఘ సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘ కార్యదర్శిగా దాడి శివ నాగ అప్పారావు, కోశాధికారిగా సూరిశెట్టి నాగ దుర్గనాయుడు, డైరెక్టర్లుగా కుంది గంగాధర్, దొడ్డి త్రినాథ్ ఎన్నికయ్యారు. సీనియర్ రైతు దాడి సూరిబాబు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. దొడ్డి గంగసూరి, రామప్పలనాయుడు, బొడ్డేడ రామునాయుడు, దాడి శ్రీరామమూర్తి, దొడ్డి సన్యాసినాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి సన్నిధిలో భజనలు



భజన చేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని మూలపేట గంగాలమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. పాటిపల్లికి చెందిన భజన బృంద సభ్యులు ఉదయం నుంచి ప్రత్యేక భజనలు, గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

27న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటిక

అనకాపల్లి టౌన్: విశాఖ బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న విశాఖపట్నం అంబేడ్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం అనే తెలుగు నాటిక ప్రదర్శించనున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. బుద్ధునితో నా ప్రయాణం అనే నాటిక ఆహ్వాన కరపత్రం, గోడపత్రికలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాటికంలో బుద్ధుని త్యాగనిరతి, జీవిత ఘట్టాలు ప్రదర్శితమవుతాయన్నారు. కార్యక్రమంలో వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, కొత్తుర్తి రామారావు, బొద్దు సోమరాజు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన యువకుడు అరెస్ట్

బీచ్‌రోడ్డు : ప్రేమ పేరుతో యువతిని శారీరకంగా వాడుకుని వదిలేసిన యువకుడిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాయకరావుపేటకు చెందిన కె.వాసు అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని చెప్పాడు. అతని మాటలు నమ్మిన యువతి వాసును ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని శరీరకంగా కలిశారు. ఇప్పుడు ఆ యువతి పెళ్లి చేసుకోమని అడిగితే అందుకు వాసు నిరాకరించాడు. దీంతో ఆమె మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు రేప్ కేసు నమోదు చేసి వాసును అరెస్ట్ చేశారు.

అమ్మో దార్లపూడి రోడ్డు



నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో రహదారిపై పడిన గోతులు



రోడ్డుపై పడిన గుంతల్లో చేరిన వర్షపు నీరు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ఎన్నికల ముందు గొల్ల బాబూరావు ఎమ్మెల్యేగా ఉంటూ రూ.16 కోట్ల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అయితే ఇంకా రోడ్డు పనులు ప్రారంభించలేదంటూ ప్రస్తుత రాష్ట్ర హోంమంత్రి అనిత ఎన్నికల ముందు పాదయాత్ర చేసి ప్రభుత్వాన్ని విమర్శించి, తాను అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రోడ్డు నిర్మాణం చేపడతామని హడావుడి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా కావస్తున్నా రోడ్డు పనులు ప్రారంభించలేదు. పైగా ఎర్త్ వర్కు అని, రోడ్డు చదును అని పలు చోట్ల తవ్వి వదిలేశారు. దీంతో రోడ్డంతా అడుగడుగునా గోతులతో నిండిపోయింది. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణం అంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆ గోతుల్లో నీరు చేరి మార్గం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయి రోడ్డు నిర్మాణం చేపట్టే వరకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు అయినా చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అప్పన్న సన్నిధిలో నాగఫణీంద్రశర్మ

వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణీంద్రశర్మ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు.

చికెన్‌తో పోటీపడుతున్న ఆగాకరకాయ

● చికెన్ కేజీ రూ.172.. ఆగాకర రూ.160



ఆగాకరకాయ

అనకాపల్లి టౌన్: కాలానుగుణంగా లభించే కాయగూరలలో ఆగాకరకాయ ఒక్కటి. దీనిలో పోషకాలు ఎక్కువగా ఉండటంతో శాకాహార, మాంసాహార ప్రియులు ఎక్కువగా తినడానికి ఇష్టపడతారు. దీని ధర మాత్రం చికెన్‌తో పోటీ పడుతోంది. అనకాపల్లి మార్కెట్‌లో ఆదివారం స్కిన్ చికెన్ కేజీ రూ.172 ఉండగా, ఆకారకాయ రూ.160 పలికింది. ఏటా వర్షాకాలంలో నెల నెలన్నర రోజులు మాత్రమే ఇది మార్కెట్‌కు వస్తుంది. ఈ సీజన్‌లో ఒక్కసారైనా ఈ కాయగూరను తినాలని, దీనిలో మలబద్ధకం, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుందని, రక్తప్రసరణ అదుపులో ఉంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

నదిలో వ్యర్థాలు వేస్తే చర్యలు



చేపల వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

బుచ్చెయ్యపేట : పెద్దేరు నదిలో చేపలు, కోళ్లు, మాంస వ్యర్థాలు వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. మేజర్ పంచాయితీ వడ్డాదిలో చేపలు, మాంస దుకాణాలు పెద్దేరు నదిని ఆనుకుని ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు వాటి వ్యర్థాలను నదిలో వేయడం వల్ల నీటి కాలుష్యం పెరుగుతోంది. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. పలువురు భక్తులు ఆలయాలకు వెళ్లే ముందు నదిలో పుణ్య స్నానాలు చేసి దేవుళ్లను దర్శించుకుంటారు. కలుషితమైన నీటిలో స్నానాలు చేసి దైవ సన్నిధిలో వెళ్లడం భక్తులకు ఇబ్బందిగా ఉంది. వడ్డాది పెద్దేరు నదిలోనే మంచినీటి బావి బోరు ఉండడంతో తాగునీరు కలుషితమై రోగాలు ప్రబలే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఈవో లవరాజు పెద్దేరు నదిలో కుళ్లిన వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని గ్రామంలో ఉన్న చేపలు, మాంసం అమ్మకాల వ్యాపారులకు తమ సిబ్బంది ద్వారా ఆదివారం నోటీసులు అందించారు.

ఉత్సాహంగా లాంగ్ వాకింగ్ పోటీలు



లాంగ్ వాకింగ్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అప్పారావు

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి వ్యక్తి నిత్య వ్యాయామం చేయాలని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ పి.ఎస్.అప్పారావు తెలిపారు. ఆగస్టు 3న అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులో లాంగ్ వాకింగ్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత మానవ జీవనశైలిలో అనేక మార్పులు సంభవించాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వివిధ రకాల వ్యాధులు బారినపడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్య వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం లాంగ్ వాకింగ్ పోటీల్లో విజేతలకు డాక్టర్ డి.డి.నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్కికాన శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలని ధర్నా



డీసీఎంఎస్ ఆవరణ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అనకాపల్లి: స్థానిక గాంధీ కూరగాయలు మార్కెట్ సమీపంలో డీసీఎంఎస్ స్థలంలో రైతులు కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు ప్రభుత్వం రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో రైతులతో కలిసి అఖిలపక్ష నేతలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలో రైతు బజారు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి 25 కిలోమీటర్లు నుంచి రైతులు తీసుకొచ్చే కూరగాయలు అమ్మకాలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, పార్టీ జిల్లా యువ నాయకుడు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఇంజిన్లకు డిమాండ్



కొమరవోలు ఆవ నుంచి ఇంజిన్ సాయంతో నారుమడులకు నీటితడి పెడుతున్న దృశ్యం

రోలుగుంట : మండల రైతాంగం ఖరీఫ్ వరి సాగులో భాగంగా వారి నారుమడుల్లో ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన వివిధ రకాల వరి విత్తనాలతో ఆకుపోత పనులు పూర్తి చేసుకున్నారు. ప్రారంభంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నారుమడులు పచ్చగానే ఉన్నాయి. వారం రోజులు నుంచి ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో నారుమడులు ఎండుపోతున్నాయి. దీంతో రైతులు సమీప చెరువుల నుంచి బిందెలు, బకెట్లతో తడుపుతున్నారు. చెరువులు దూరంగా ఉంటే ఇంజిన్లతో నారుమడులు తడుపుతున్నారు. ఇదే అదనుగా ఇంజిను యజమానులు నారుమడికి రూ.300 తీసుకుంటున్నారు. అన్ని గ్రామాల్లో ఒకేసారి ఈ పనులు ప్రారంభం కావడంతో తమ గ్రామాల్లో ఇంజిన్లు లేకుండా పొరుగు గ్రామాలకు వెళ్లి ఇంజిన్లు తెచ్చుకొని నారుమడులు తడుపుతున్నారు. స్థానిక నది చెరువు, కొత్త చెరువు కింద ఆకుమడులను ముద్దు దాలరాజు, అప్పలనాయుడు వారంలో 120 మంది రైతుల నారుముడులు తడిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విత్తనాలు రేటు కూడా పెరగడంతో రైతులపై అధిక భారం పడడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

ధర్మశ్రీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ధర్మశ్రీని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన కరణం ధర్మశ్రీని ఆ పార్టీ మండల నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్‌తో పాటు మండల నాయకులు భీముని వెంకటేష్, కోట్ని శివ, ఈఠ బాబూరావు, నగిరెడ్డి నాగేశ్వరావు, గొర్లి ప్రసన్నకుమార్, రవీంద్ర రాజు గాజువాకలోని ధర్మశ్రీ స్వగృహంలో ఆత్మీయంగా కలిసి సత్కరించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మునగపాకలో అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. మునగపాక పంచాయతీ 15వ ఆర్థిక సంఘ నిధులతో పంచాయతీ కార్యాలయం నుంచి ఆడారి పోలయ్య ఇంటి వరకు ఏర్పాటు చేస్తున్న అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా కృషి చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించామన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

మేఘాలు కనువిందు

కొండపై ఆహ్లాదకర వాతావరణం



మండలంలో దార్లపూడి శివారు కొండలపై మబ్బులు కనువిందు చేశాయి. ఆదివారం దార్లశివారు ఇందేశమ్మవాక సమీపంలో కొండపైకి పొగమంచు కురిసినట్టుగా మేఘాలు కమ్ముకున్నాయి. అటుగా ప్రయాణాలు చేసే వారు తమ మొబైల్ ఫోన్లలో ఈ దృశ్యాలను చిత్రీకరించారు.

ఎస్.రాయవరం

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం సంతోషి మాత దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్‌రావు దంపతులు ఆదివారం ఇక్కడ అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పంచదార, తేనె పసుపు కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు కామేశ్వరరావుశర్మ, ధర్మకర్తలు ఆళ్ల రవికుమార్, బుద్ధ ఈశ్వరరావు, పొలిమేర సన్యాసినాయుడు, పీలా రాజేష్, కర్రి మణి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ హాస్టళ్ల సందర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి ఫణీంద్ర కుమార్

నర్సీపట్నం : ఈ నెల 21 నుంచి 31 వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సందర్శన కార్యక్రమాన్ని చేపడుతున్నామని జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయన్నారు. సరైన సౌకర్యాలు లేవని, పలు చోట్ల సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్శిటీని కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. హాస్టళ్ల సందర్శనలో గుర్తించిన అంశాలను అధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో జగదీష్, సింహాద్రి, ప్రసాద్, సింహాద్రి, జస్వంత్, ధర్మ, పండు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు చిన కన్నబాబు

దేవరాపల్లి : అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఆదుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు చిన కన్నబాబు కోరారు. ఈ మేరకు దేవరాపల్లిలో మండల పెన్షనర్ల (రిటైర్డ్ ఉద్యోగులు) అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చినకన్నబాబు మాట్లాడుతూ తమకు పెండింగ్‌లో ఉన్న డీఆర్ (కరువు భత్యం) చెల్లించాలని, పీఆర్సీ, ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు డీఆర్, పీఆర్సీ లేకుండా చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అనంతరం దేవరాపల్లిలో నూతనంగా నిర్మించిన భగవాన్ సత్యసాయి ధ్యాన మందిరానికి పెన్షనర్ల అసోసియేషన్ తరపున రూ.10 వేల నగదును స్థానిక మందిర కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ మండల కార్యదర్శి పోతల చిన అప్పలనాయుడు, ట్రెజరర్ గాలి అబద్ధం, గౌరవ అధ్యక్షుడు చలుమూరి అప్పలనాయుడు, పూర్వ కార్యవర్గ ఆదిరెడ్డి చిన్నంనాయుడు పాల్గొన్నారు.